క్లుప్తంగా

క్రీడాకారుడికి అభినందనలు



అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

సుల్తానాబాద్: జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైన సంప్రీత్‌ను ఎమ్మెల్యే విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు అభినందించారు. మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఐపీఎస్ కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడం అజయ్, ప్రధాన కార్యదర్శి బొల్లి సత్యనారాయణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్ల సురేశ్, కోశాధికారి గోపికృష్ణ, సహాయ కార్యదర్శి ఇక్బాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం 26 నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో ఆఫీసు డీఏవో రజితకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు మంజూరు చేసిందని ఊరూరా నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలంతా వ్యతిరేకించారని పార్టీ పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేశ్, మండల అధ్యక్షుడు వేల్పుల రమేశ్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు చిలారపు పర్వతాలు, కావేటి రాజ్‌గోపాల్, తంగెడ రాజేశ్వర్‌రావు, దాడి సంతోష్, ఉప్పు కిరణ్, శ్రీకాంత్, కందుల శ్రీనివాస్, తిరుపతి, రాజేంద్రప్రసాద్, సతీశ్, వంశీ, పిట్ట వినయ్, సతీశ్, వేణు, సోడా బాబు, హర్షదీప్ ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ



కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో పద్మజ

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లోని లబ్ధిదారులకు ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటరీకరణ ప్రారంభించారు. ప్రజాపాలన గ్రామసభలో పెట్టిన జాబితాలో లబ్ధిదారుల పేర్లు రాని వారి దరఖాస్తులను తీసుకుని కంప్యూటరీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పద్మజ పరిశీలించి సూచనలు చేశారు. ఎంపీవో అనిల్ రెడ్డి, కార్యదర్శులు, ఆపరేటర్లు ఉన్నారు.

అవయవదానానికి ముందుకు రావాలి

రామగిరి: మరణానంతరం నేత్ర, శరీర అవయవదానం చేయడానికి ప్రతీఒక్కరు ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సలహాదారు నూక రమేశ్ అన్నారు. సెంటినరికాలనీ ఆర్జీ–3 డివిజన్‌లోని మైన్స్ ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్‌లో శుక్రవారం నేత్ర, శరీర, అవయవ దానాలపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. కుటుంబంలో ప్రతీ ఒక్క సభ్యుడికి అవగాహన కల్పించి, అవయవాలను దానం చేసేలా చైతన్యం చేయాలన్నారు. సెంటర్‌లో శిక్షణ పొందుతున్న 45 మంది యువ ఉద్యోగులు అవయవదానానికి ముందుకు రాగా ప్రతినిధులు వారికి డోనర్ కార్డులు అందజేశారు. వీటీసీ మేనేజర్ సుజిత్ శ్రీనివాస్, సదాశయ ప్రతినిధులు సమ్మయ్య, శ్రావణ్‌కుమార్, సాన రామకృష్ణారెడ్డి, గంట వెంకటరమణారెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు

జూలపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను పక్కదారి పట్టించి, పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. జూలపల్లి మండలం పెద్దాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పేరుతో ప్రజలను మోసగించి మరోసారి లబ్ధి పొందేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్తారన్నారు. పార్టీ నాయకులు పూరెల్ల గంగయ్య, సంకెళ్ల లక్ష్మీనర్సయ్య, కొండపల్లి కృష్ణమూర్తి, సత్యసాగర్, తొగరి శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, కల్లెపల్లి అంజయ్య, స్వామి, నరేశ్, కిషన్ పాల్గొన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే

- బాలికలకు ఉచిత శిక్షణ
- 125 ప్రభుత్వ పాఠశాలల్లో మూడునెలల పాటు అమలు



సుల్తానాబాద్‌లో కరాటే సాధన చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్: ఆత్మరక్షణ కోసం కరాటే విద్య, శారీరక వ్యాయామం ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలికల కోసం కరాటే నేర్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వడానికి కరాటే మాస్టర్లను ఎంపిక చేశారు. నెలకు రూ.5వేల చొప్పున మాస్టర్లకు గౌరవ వేతనం అందివ్వనున్నారు. జిల్లాలోని 125 ప్రభుత్వ హైస్కూళ్లలో ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. జనవరి 24 నుంచి మార్చి 24 వరకు ఈ శిక్షణ కొనసాగుతుంది.

125 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో..

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినులు చదువుతో పాటు కరాటేలో శిక్షణ పొందనున్నారు. జిల్లావ్యాప్తంగా14 మండలాలతోపాటు సుల్తానాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, మంథని మున్సిపాలిటీలు, మండలాల్లో 203 సర్కారు బడులు ఉన్నాయి. తొలివిడతలో ఎంపిక చేసిన 125 జెడ్పీ బాలికల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నేర్పిస్తున్నారు.

ధీమా పెంచేలా..

ఏదైనా అనుకోని ఘటన ఎదురైనా బాలికలు తమని తాము రక్షించుకునే ఆత్మవిశ్వాసం, ధీమా పెంచేందుకు కరాటే శిక్షణ తోడ్పడుతుంది. గతంలో సర్వశిక్షా అభియాన్ ద్వారా నిధులిచ్చి తరగతులు నిర్వహించారు. కానీ కరోనా ప్రభావం అనంతరం ఇది కాస్త అటకెక్కింది. కుంగ్‌ఫూ, కరాటే, జూడో వంటివి నేర్పించేలా శిక్షకులను నియమించారు. నిత్యం గంట శిక్షణ ఇస్తున్నారు. కనీసం ఆరునెలల పాటు అవకాశం కల్పిస్తే వారు ఏమైనా నేర్చుకునే అవకాశం లభిస్తుందని శిక్షకులు చెప్తున్నారు.

మెలకువలు నేర్పుతాం



కరాటే నేర్చుకోవడంతో బాలికలకు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఎదుటివారు దాడులు చేసినప్పుడు ఎలా రక్షించుకోవాలో మెలకువలు నేర్పుతాం. ప్రభుత్వం కొద్దిరోజులు శిక్షణ కాలం పెంచితే బాగుండేది.

– కనకేశ్, కరాటే మాస్టర్, సుల్తానాబాద్

ఉచిత శిక్షణ తరగతులు

జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో బాలికలకు ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం ఎంపిక చేసిన 125 హైస్కూళ్లలో కరాటే శిక్షణను ప్రారంభించాం. విద్యార్థులు విధిగా నేర్చుకోవాలి. భవిష్యత్‌లో ఉపయోగపడుతుంది.

– కవిత, డీసీడీవో, పెద్దపల్లి

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



ఇంటి పన్ను స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ కోరారు. రెగ్యులర్ ఇంటి పన్నులతో పాటు బకాయిలు చెల్లించాలన్నారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. అలాగే కొత్తగా ఇంటిని నిర్మించుకున్న వారు ఇంటి నంబర్ కోసం మున్సిపల్ ఆఫీస్‌కు రాకుండానే సీడీఎంఏ వెబ్‌సైట్‌లో సెల్ఫ్ అసెస్‌మెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రాలు, మున్సిపల్ ఆఫీస్ నుంచి పొందిన అనుమతి పత్రాలతో ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకుంటే ఇంటి నంబర్ కేటాయిస్తారని పేర్కొన్నారు. అందరూ ఆన్‌లైన్ సేవలు వినియోగించుకోవాలన్నారు.

ఆర్టిజన్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి



రిలే దీక్షల్లో ఆర్టిజన్లు

పెద్దపల్లిరూరల్: విద్యుత్ సంస్థలో ఒకే విధమైన పనిచేస్తున్న వారికి రెండు సర్వీస్ రూల్స్ ఎలా అమలు చేస్తారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యం రావు ప్రశ్నించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని డీఈ ఆఫీసు ఎదుట రిలేదీక్షలు చేస్తున్న ఆర్టిజన్ల శిబిరాన్ని శుక్రవారం సందర్శించి మద్దతు ప్రకటించారు. విద్యుత్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న వారికి ఆర్టిజన్ అనే పేరు పెట్టి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఆర్టిజన్లను కూడా విద్యుత్ ఉద్యోగులుగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు వాగునాయక్, భిక్షపతి, శ్రీనివాస్, రాజయ్య, రామస్వామి, సదానందం, శంకర్, కిషన్‌రెడ్డి, రాజు, విశ్వనాథ్, దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, సత్యం, శ్రీనివాస్ ఉన్నారు.

వైకుంఠపతి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

సుల్తానాబాద్: ప్రత్యేక రాష్ట్రం కోసం దీక్షా శిబిరాన్ని కొనసాగించిన ఉద్యమకారుడు, పట్టణానికి చెందిన పారుపల్లి వైకుంఠపతి విగ్రహం ఏర్పాటు చేసేందుకు అఖిలపక్షం సభ్యులు శుక్రవారం భూమిపూజ చేశారు. విగ్రహం ఏర్పాటు కోసం ఎమ్మెల్యే విజయరమణారావు సైతం సానుకూలంగా ఉన్నారని వారు తెలిపారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పారుపల్లి వెంకట ఉమాపతి, గుణపతి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గాజుల రాజమల్లు, పొన్నం చంద్రయ్య, బాపూరావు, నరేందర్, అమిరిశెట్టి తిరుపతి, తిప్పారపు దయాకర్, గెల్లు మధుకర్, శ్యాంసుందర్, సురేశ్, కుమారస్వామి, తిరుపతి, మున్నూరు కాపు జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు సాదుల సుగుణాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కొదురుపాకకు చెందిన కల్లెపల్లి కనుకయ్య గుడిసె శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం కనుకయ్య భార్య ఉమతో కలిసి వ్యవసాయ కూలీపనికి వెళ్లాడు. అతడి కొడుకు, కూతురు స్కూల్‌కు వెళ్లారు. గుడిసెలోంచి మంటలు రావడంతో స్థానికులు గమనించి కనుకయ్యకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పినప్పటికీ గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న రెండు తులాల బంగారం, మహిళా గ్రూపులో తీసుకున్న లోన్ నగదు రూ.90వేలతో పాటు సామగ్రి పూర్తిగా ఖాళీపోయాయి. దాదాపు రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. గిర్దావర్ వినోద్ వచ్చి పంచానామా చేసి తక్షణ సాయంగా 25కిలోల బియ్యం అందించారు. కనుకయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు రాజాగౌడ్, స్థానికులు కోరారు.

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి, రంగంపల్లి, గుండంకట్ట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ రాజ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు రంగంపల్లి, చందపల్లి, నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దబొంకూర్, పెద్దకల్వల ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 12గంటల దాకా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కలుగుతుందని పేర్కొన్నారు.

• 26న రైతుభరోసా పథకం ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు 26న రైతు భరోసా పథకం నిధులు మంజూరు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి సతీశ్ తెలిపారు. జనవరి 1, 2025లోపు పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులు అర్హులు. కాగా ఇటీవల నూతనంగా సాగుకు యోగ్యమైన భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు పూర్తి ధృవీకరణపత్రాలతో మండల వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

• అనారోగ్యంతో న్యాయవాది మృతి

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ సభ్యులు, మాజీ ఎఫ్‌సీఐ ఉద్యోగి సంక్రె సదానందం(68) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మాతంగికాలనీలో నివాసం ఉండే సదానందం కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటుండగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

• చికిత్స పొందుతూ ఆర్ఎంపీ మృతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్‌కు చెందిన ఆర్ఎంపీ విజయసారథి అనారోగ్యంతో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోదావరిఖని హిందూ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు.

• నేడు కొలనూర్‌లో ఉచిత వైద్యశిబిరం

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ప్రారంభిస్తారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ ఉంటుందన్నారు.

• రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఓదెల: రైతుభరోసా పథకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఓదెల వ్యవసాయాధికారి భాస్కర్ శుక్రవారం సూచించారు. మండలంలో 880 రైతులకు నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరయ్యాయన్నారు. రైతుభరోసా కోసం పట్టాదారు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుబుక్ జిరాక్స్ ప్రతులతో గ్రామాల్లోని ఏఈవోలకు దరఖాస్తులు అందించాలన్నారు.

• మాతంగి కాలనీని తరలించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు విస్తరణలో భాగంగా సమీపంలో ఉన్న మాతంగి కాలనీని మరోచోటుకు తరలించాలని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి రామాచారి కోరారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీజీఎం కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించినట్లు తెలిపారు. భిక్షపతి, మల్లేశ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

• సైబర్ మోసాల బారిన పడొద్దు

పెద్దపల్లిరూరల్: సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త కొత్త విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారని, ప్రతీఒక్కరు సైబర్ నేరాలపై కనీస అవగాహన పెంచుకోవాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీ) చీఫ్ మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఐటీఐ మైదానంలో శుక్రవారం అవగాహన కల్పించారు.

• లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు

మంథని: మండలంలోని సూరయ్యపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు వెంకన్న, రాజు, గట్టయ్య, లింగయ్య, మల్లేశ్, కార్తీక్, సతీశ్, శంకర్ తెలిపారు.

రెస్క్యూ అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానిస్తున్న రెస్క్యూ అధికారులు, సిబ్బంది

గోదావరిఖని: రెస్క్యూ సిల్వర్ జూబ్లీ అవార్డు సాధించిన ఇద్దరిని గురువారం ఘనంగా సన్మానించారు. మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆక్టివ్ రెస్క్యూ బ్రిగేడ్ ఎలిగేటి ఆనందం, మాజీ బ్రిగేడ్ కాంతాల మల్లారెడ్డిని సన్మానించారు. రెస్క్యూ అధికారి భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి రక్షణ కవచం రాజ్యాంగం



కరపత్రం ఆవిష్కరిస్తున్న పుట్ట మధు, నాయకులు

మంథని: దేశానికి రక్షణ కవచం రాజ్యాంగం అని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. పట్టణంలోని రాజగృహలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న కాటారంలో ఏర్పాటు చేయనున్న రాజ్యాంగ స్థూపానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ చౌరస్తాలో పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ స్థూపం ఆవిష్కరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏగోలపు శంకర్, శంకేశి రవీందర్, కిషన్‌రెడ్డి, శంకర్‌లాల్ పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం



మొక్క నాటుతున్న సూపర్‌వైజర్ అనిత

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లిలోని అంగన్వాడీ సెంటర్–1లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత మొక్కలు నాటారు. అంగన్వాడీ టీచర్ హేమలత పాల్గొన్నారు.

షీటీంలతో మహిళలకు భద్రత

జ్యోతినగర్: షీటీంలతో మహిళలకు భద్రత కల్పిస్తున్నట్లు షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లయ్య అన్నారు. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్, అన్నపూర్ణకాలనీలోని కృష్ణవేణి హైస్కూల్‌లోని విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. షీటీం సభ్యులు స్నేహలత, హెచ్‌ఎం మంజూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లలు.. కేజీబీవీలోకి



కేజీబీవీ స్కూల్లో చేర్పిస్తున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం శుక్రవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇద్దరు బాలికలను గుర్తించారు. మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మి, కోమలత తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యత వివరించి కాల్వశ్రీరాంపూర్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చేర్పించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ మధ్యలో బాడి మానివేసిన బాలికలు నేరుగా బడిలో చేరొచ్చని పేర్కొన్నారు. విద్యాశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మహేశ్ తల్లిదండ్రులను కోరారు. సీఆర్పీ కుంట కుమారస్వామి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలి



కారుణ్య నియామక పత్రాలు అందుకున్న వారితో జీఎం వెంకటయ్య, అధికారులు

గోదావరిఖని: క్రమశిక్షణ, అంకిత భావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య పేర్కొన్నారు. ఏడుగురు కార్మికుల పిల్లలకు శుక్రవారం ఆయన కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. జీఎం మాట్లాడుతూ వారసత్వంగా అందించిన ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గైర్హాజర్ లేకుండా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. సీనియర్ ఉద్యోగుల సూచనలు, సలహాలు పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, పర్సనల్ డీజీఎం ఎస్.అనిల్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్, డీవైపీఎం వంశీధర్ ఉన్నారు.

బొమ్మల కొలువు సందర్శన



సందర్శిస్తున్న కార్మిక సంఘాల నేతలు

గోదావరిఖని: అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఇల్లెందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువును గురువారం కార్మిక సంఘాల ముఖ్య నాయకులు, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలు, పురాతన కళలు, ఉట్టిపడేలా తీర్చిదిద్దిన లేడీస్ క్లబ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మడ్డి ఎల్లయ్య, జనక్‌ప్రసాద్, మిర్యాల రాజిరెడ్డి, యాదగిరి సత్తయ్య, రియాజ్ అహ్మద్, తుమ్మల రాజారెడ్డి, ఆరెల్లి పోషం, నర్సింహారెడ్డి సీఎంవోఏఐ అధ్యక్షుడు కోలా మల్లేశ్ పాల్గొన్నారు.

సింగరేణి సహకారంతో మేడిపల్లి అభివృద్ధి



పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

జ్యోతినగర్: సింగరేణి సంస్థ సహకారంతో రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి గ్రామం అభివృద్ధి దిశగా పయనిస్తోందని రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్ అన్నారు. డివిజన్‌లో శుక్రవారం సింగరేణి సంస్థ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. సింగరేణి ఓసీపీ–4 ప్రాజెక్టుతో ఎంతో నష్టపోయిన మేడిపల్లి ఇటీవల సంస్థ చేపట్టిన పనులతో అభివృద్ధి చెందుతోందన్నారు. మూడునెలల నుంచి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామాభివృద్ధి కోసం సుమారుగా రూ.కోటి 30 లక్షలు మంజూరు చేసినందుకు సింగరేణి యాజమాన్యానికి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక హక్కుల సాధనలో రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల హక్కుల సాధనలో రాజీలేకుండా ముందుకు సాగుతామని నూతనంగా ఎన్నికైన ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు బదావత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఓసీపీ–3లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, సెంట్రల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొత్త సత్యనారాయణరెడ్డిని సన్మానించారు. రానున్న రోజుల్లో యూనియన్ నాయకులందరినీ కలుపుకుని ఏరియాలో యూనియన్ బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఓసీపీ–3 సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. నాయకులు మార్కండేయ, ఎట్టెం కృష్ణ, కొంగర రవీందర్, ఆకుల రాజయ్య, కోల కనకయ్య, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ పోలీస్, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులతో ఆర్టీసీ డిపో, బస్టాండ్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ కె.సంతోష్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం మాట్లాడారు. ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్, సంతోష్, ట్రాన్స్‌పోర్టు, ట్రాఫిక్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

పాలకుర్తి: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల హెచ్‌కేఆర్ టోల్‌ప్లాజా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టోల్ ప్లాజా అధికారులు విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ప్లాజా ఏజీఎం రామకృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు నవీన్‌కుమార్, రమేశ్, పీఆర్‌వో రాము, హెచ్‌ఆర్ అధికారి సుజిత్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ కార్డుల నమోదు

జ్యోతినగర్: రామగుండ కార్పొరేషన్ మూడో డివిజన్‌లో ఆయుష్మాన్‌భవ కార్డుల నమోదు ప్రక్రియ చేపట్టారు. అన్నపూర్ణకాలనీలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రామగుండం అర్బన్ హెల్త్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భవ కార్డుల నమోదు చేపట్టారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు లింక్ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కాంగ్రెస్ మూడో డివిజన్ అధ్యక్షుడు మల్లేశ్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు చంద్రకళ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని: జీడీకే–5ఓసీపీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు మేనేజర్ అనిల్ గబాలేకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు ధర్మపురి, సదానందం, దాస్, కృష్ణ, బేబీ శ్రీనివాస్ ఉన్నారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి

పాలకుర్తి: మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన నల్లూరి మహిశ్రీ(2) అనే చిన్నారి అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్లూరి సదయ్య–మానస దంపతుల కుమార్తె మహిశ్రీ నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. పెద్దపల్లిలో రెండురోజులపాటు చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం గురువారం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

సెక్యూరిటీ సిబ్బంది పరేడ్ ప్రాక్టీస్

గోదావరిఖని: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం సెర్మోనియల్ పరేడ్ ప్రాక్టీస్ నిర్వహించారు. సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్ ముఖ్య అతిథిగా హాజరై గణతంత్ర దినోత్సవం నిర్వహించాల్సిన విధివిధానాలను సూచించారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజయ్య జమేదార్లు సంపత్, విజయ్‌కుమార్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జీతభత్యాలు పెంచాలి

గోదావరిఖని: ఆర్ఎఫ్‌సీఎల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని చలో ఢిల్లీ తలపెట్టినట్లు ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 10న ఢిల్లీలోని ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్ఎఫ్ఎల్ హెడ్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు రాంకీ, సతీశ్, రాకేశ్, శ్రీకాంత్, శ్రావణ్, సురేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఫోర్‌లైన్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక ఎస్సై స్వామి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని గుర్తించి కేసు నమోదు చేశారు.